క్లుప్తంగా

మిల్లు యాజమాన్యంపై కేసు

నాగారం : మండలంలోని ఈటూరు ఆవాసం ప్రగతినగర్ వద్ద ఉన్న రఘురామ రైస్ మిల్లు యాజమాన్యం ప్రభుత్వానికి అప్పగించాల్సిన సీఎంఆర్ రైస్ లో అవకతవకలకు పాల్పడినట్లు విచారణలో తేలడంతో సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ రాములు ఫి ర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.వెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రఘురామ రైస్ ఇండస్ట్రీస్ మిల్లుకు ప్రభుత్వం అప్పగించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) 2022–23 యాసంగి, 2023–24 వానాకాలం సీజన్లకు సంబంధించి ధాన్యం నిల్వలకు, ప్రస్తుతం ఉన్న స్టాక్ వివరాలకు వ్యత్యాసం ఉన్నట్లు సివిల్ సప్లయ్ అధికారుల విచా రణలో తేలిందని అన్నారు. మిల్లు యాజమాన్యంపై సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జహంగీర్‌ను గెలిపించాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న మల్లు నాగార్జున్‌రెడ్డి

అర్వపల్లి : భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి జహంగీర్‌కు ప్రజలు ఓట్లేసి అత్యధిక మెజా ర్టీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్య దర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి కోరారు. భువన గిరిలో జహంగీర్ నామినేషన్ కార్యక్రమానికి అర్వపల్లి నుంచి వెళ్తున్న వాహనాల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ప్రజా గొంతుక జహంగీర్ గెలుపు ప్రజల కు ఎంతో అవసరమని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం జహంగీర్ అనేక ఉద్యమాలు చేపట్టారని చెప్పారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వాన్ని ఈసారి సాగనంపాలని కోరారు. ఒక్కసారి సీపీఎంకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, డీవైఎఫ్‌వై రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, బుర్ర శ్రీనివాస్, మండల కారదర్శి వజ్జె శ్రీనివాస్, దండ వెంకట్‌రెడ్డి, గోవిందు, దనియాకుల శ్రీకాంత్, వీర బోయిన రవి, అంజిబాబు, దాసు, సాయికుమార్, ఎల్లంల అవిలయ్య, శిగ వెంకన్న, వజ్జె వినయ్‌యాదవ్, అబ్బులు, రవికుమార్, వీర స్వామి, కొప్పోజు సరోజ, అంజయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వరికోత యంత్రం దగ్ధం

మద్దిరాల : వెల్డింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు నిప్పంటుకొని వరికోత యంత్రం దగ్ధమైంది. ఈ సంఘటన ముకుందాపురంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం .. గ్రామానికి చెందిన లింగిడి సురేష్ తన వరికోత యంత్రానికి వెల్డింగ్ చేస్తుండగా నిప్పురవ్వలు లేచి యంత్రంలో గడ్డికి అంటుకున్నాయి. ఆ నిప్పు మిషన్‌పైన ఉన్న డిజిల్ క్యానుకు అంటుకోవడంతో వరికోత మిషన్ దగ్ధమైంది.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు



మున్యానాయక్ తండాలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



భీమ్లాతండాలో పాఠశాల వద్ద..



జయరాంగుడితండాలో..

- కంచెలు లేకుండా జనావాస ప్రాంతాల్లో ఏర్పాటు
- భయాందోళనకు గురవుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

చివ్వెంల : మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లోని రోడ్లు, వీధుల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ట్రాన్స్ ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయకుండా వదిలి వేయడంతో ప్రజలు భాయాందోళనకు గురవుతున్నారు. రోడ్ల పక్కనే ట్రాన్స్‌ఫార్మర్లు ఉండటంతో ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జనావాసాల్లో అధికం..

మండల పరిధిలోని పలు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను పాఠశాలలు, అంగన్‌వాడీ స్కూళ్లు, ప్రజలు రాకపోకలు సాగించే ప్రాంతాల్లో ఇష్టారీతిగా ఏర్పాటు చేశారు. వీటి పక్కనుంచే రాకపోకలు చేయాలంటే ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. మండలంలోని వాల్యా తండాలోని ప్రభుత్వ పాఠశాల వద్ద పిల్లలకు అందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. మున్యానాయక్ తండాలో ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంతోపాటు, పశువులు ఉండే ప్రాంతంలోనే కంచె లేకుండా ట్రాన్స్‌పార్మర్ ఉంది. దీంతో చిన్న పిల్లలతోపాటు, పశువులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంతులేని నిర్లక్ష్యం..

ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె నిర్మాణంపై సంబంధిత శాఖల అధికారులు అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శించడం సరికాదని ప్రజలు పేర్కొంటున్నారు. సమస్యను విద్యుత్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదం ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కంచె ఏర్పాటు చేయాలి

చాలా గ్రామాల్లో ట్రాన్స్‌పార్మర్లకు కంచెలు లేకుండా ఉండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు చేతికందే ఎత్తులో ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు ఏర్పాటు చేయాలి.

- బానోతు మంగులాల్ నాయక్, మున్యానాయక్ తండా

ఇళ్ల మధ్య ఉండడంతో ఇబ్బందులు

ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎలాంటి ప్రమాదం జరుగకుండా చూడాలి. ట్రాన్స్ ఫార్మర్లు ఇళ్ల మధ్యన ఉండటంతో వర్షాలు పడినప్పుడు ఇబ్బందులు పడుతున్నాం. నిత్యం ప్రజలు నడిచే బాటల్లో ఏర్పాటు చేయడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు ఏర్పాటు చేయాలి.

- ధరావతు నరేష్ నాయక్, సేవాలాల్ తండా

బీఆర్‌ఎస్‌కు మంచి రోజులు రానున్నాయి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి



నక్కగూడెంలో ఎద్దుల పందేలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

హుజూర్‌నగర్ : బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం కష్టకాలంలో ఉన్నప్పటికీ పార్టీకి ముమ్ముందు మంచి రోజులు రానున్నాయని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. శుక్రవారం చింతలపాలెం మండలం నక్కగూడెంలో శ్రీ సీతారామచంద్రమూర్తి కల్యాణ మహోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఎద్దుల పందేలను మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీష్ రెడ్డి మాట్లాడుతూ సీతారామస్వామి వారి ఆశీస్సులు అందరిపై ఉండాలని అన్నారు. ఇంతకంటే కష్టకాలాన్ని బీఆర్ఎస్ పార్టీ చవి చూసిందని తెలిపారు. అయినా ఏరోజు కూడా పార్టీ కానీ, నాయకులు కానీ వెనకడుగు వేయలేదని, ఎత్తిన జెండా దించలేదని ఆయన చెప్పారు. రానున్న మంచి రోజులు అన్నీ బీఆర్ఎస్‌వేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కళ్ల ముందు పంటలు ఎండిపోతున్నా కనీసం స్పందించని మంత్రులు ఈ తెలంగాణ రాష్ట్రంలో ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. పోలీసు కేసులు బీఆర్ఎస్ పార్టీకి కొత్త ఏం కాదని, అన్నిటిని ఎదుర్కొనే పార్టీ బలంగా నిలబడిందని, ఇక ముందు కూడా అలాగే ఉంటుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి యూటీఎఫ్ కృషి



ఉప్పలాచారి కుటుంబ సభ్యులకు సంక్షేమ నిధి చెక్కు అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

సూర్యాపేటటౌన్ : ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, బలోపేతానికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి యూటీఎఫ్ నిరంతరం కృషి చేస్తోందని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య అన్నారు. ఉపాధ్యాయుడు కొండగూడూరు ఉప్పలాచారి ఇటీవల మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం సూర్యాపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో సంఘం కుటుంబ సంక్షేమ నిధి నుంచి రూ.6లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.రాములు, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కోశాధికారి నాగమణి, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, యాకయ్య, శ్రీనివాసరెడ్డి, అరుణభారతి, వెంకటయ్య, నర్సింహ, ఆడమ్, సరిత, భరత్, శ్రీను పాల్గొన్నారు.

నీటి సమస్యకు పరిష్కారం



అర్వపల్లిలోని సంతలో బోరును ఫ్రెషింగ్ చేయగా వస్తున్న నీళ్లు



తుంగతుర్తి : తూర్పుగూడెంలో బోరు పంపులను రిపేరు చేస్తున్న సిబ్బంది

అర్వపల్లి : అర్వపల్లిలో ఎస్‌డీఎఫ్, మిషన్ భగీరథ ఓఅండ్ఎం నిధుల ద్వారా అధికారులు నీటి సమస్యను పరిష్కరించారు. స్థానికంగా ఉన్న రక్షిత మంచినీటి పథకం బోర్లు కొన్ని పూడిపోగా ఫ్రెషింగ్ చేయించారు. అలాగే మోటార్లు లేని బోర్లకు కొత్తవి బిగించారు. అర్వపల్లిలోని సంత ఆవరణలో రక్షిత మంచినీటి పథకం బోరు పూడిపోగా దీనిని ఫ్రెషింగ్ చేయించగా నీళ్లు పెరిగాయి. ఈ బోరు ఫ్రెషింగ్ చేయించడంతో నీళ్లు నిండుగా వస్తున్నాయి. అలాగే పైపులైన్ల పనులు కూడా చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఫ్రెషింగ్ చేయించిన బోరును ఎంపీడీఓ సందీప్‌కుమార్, మిషన్ భగీరథ ఏఈ మహేష్, పంచాయతీ కార్యదర్శి శ్రావణి శుక్రవారం పరిశీలించారు. స్థానికంగా నీటి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

తుంగతుర్తి : వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా నీటి ఎద్దడి నివారణ కోసం అధికారులు తూర్పుగూడెం గ్రామంలో శుక్రవారం చేతిపంపుల రిపేరు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి నవీన్ మాట్లాడారు. గ్రామంలో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా చేతిపంపులను బాగు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లేపాక సోమయ్య, జీపీ సిబ్బంది మహేష్, నర్సయ్య, అవిలయ్య తదితరులు పాల్గొన్నారు.

తొట్లు ఇలా.. పశువులకు నీరెలా?

- జాజిరెడ్డిగూడెం మండలంలో 50కి పైగా నీటి తొట్లు
- ఒకటి రెండు మినహా మిగిలినవి నిరుపయోగంగా మారిన వైనం
- దాహంతో అల్లాడిపోతున్న మూగజీవాలు
- నీటి తొట్లను వినియోగంలోకి తేవాలని కోరుతున్న రైతులు



కొమ్మాలలోని కొత్తగూడెంబజారులో చెత్తతో నిండిన నీటి తొట్టి



అర్వపల్లిలోని సంతలో నిరుపయోగంగా..

అర్వపల్లి : వర్షాభావ పరిస్థితులు, ఎండలతో చెరువులు, కుంటలలో నీళ్ల అడుగంటిపోయాయి. ఎండలు రోజురోజుకు అధికమవుతుండటంతో భూగర్భ జలాలు పడిపోతున్నాయి. గ్రామాల్లో ప్రజలతోపాటు పశువులు, జీవాలకు కూడా నీటి సమస్య ఏర్పడింది. 15 ఏళ్ల క్రితం ప్రభుత్వం గ్రామాల్లో పశువులు, మూగజీవాలకోసం నీటి తొట్లు నిర్మించింది. ప్రతి గ్రామంలోనూ రెండు నుంచి నాలుగు వరకు నీటి తొట్లు నిర్మించి గ్రామ పంచాయతీ బోర్లనుంచి నీటి సౌకర్యం కల్పించారు. ఉదయం, సాయంత్రం పశువులు, జీవాలు అందులో నీటిని తాగేవి. కాలక్రమేణ నీటి తొట్ల నిర్వహణను నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో ప్రస్తుతం చాలా చోట్ల నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుతున్నాయి. గ్రామాల్లో చెరువులు, కుంటలు ఎండిపోవడంతో మూగజీవాలకు తాగు నీటి సమస్య ఏర్పడింది.

జాజిరెడ్డిగూడెం మండలంలో..

జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా గ్రామ పశు సంపదను బట్టి ఒక్కో గ్రామంలో రెండు నుంచి నాలుగుకు పైగానే నీటితొట్లు నిర్మించారు. ఇందులో కేవలం రెండు మూడు మాత్రమే పనిచేస్తున్నాయి. వీటిలో నీటిని నింపి పశువులకు అందిస్తున్నారు. మిగిలినవన్నీ నిరుపయోగంగా ఉన్నాయి. గ్రామాల్లో పాడైన వాటిని మరమ్మతు చేయించడంతోపాటు మిగిలిన వాటిలో కూడా నీటిని నింపి ప్రస్తుత వేసవిలో పశువులు, జీవాల దాహార్తిని తీర్చాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

మూగజీవాలు అల్లాడిపోతున్నాయి



పశువులు, జీవాలకు నీటి సమస్య తీర్చడం కోసం గ్రామ గ్రామాన నిర్మించిన నీటి తొట్లు ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో నీటి కోసం మూగజీవాలు ప్రతిరోజు ఇబ్బంది పడుతున్నాయి. వీటిని వినియోగంలోకి తేవాలి.

- వజ్జె వినయ్, రైతు, రామన్నగూడెం

ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



నాగారం : వర్ధమానుకోటలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ



నాగారం : పసునూర్‌లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈఓ అశోక్



అర్వపల్లి : తిమ్మాపురంలోని కొనుగోలు కేంద్రంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న ఏఈఓ సత్యం



తుంగతుర్తిలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ జగ్గునాయక్



మద్దిరాల : రామచంద్రాపురంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

నాగారం : ధాన్యం కొనుగోళ్లలో నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఆర్‌డీఓ మధుసూదనరాజు, డీఈఓ అశోక్‌లు హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని వర్ధమానుకోట, పస్తాల, పసునూర్, నాగారంబంగ్లా గ్రామాల్లోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా పూర్తి చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను వెంట, వెంటనే ట్యాబ్‌లలో నమోదు చేయాలని సూచించారు. కాంటా అయినా ధాన్యాన్ని వెంట, వెంటనే లారీలలో మిల్లులకు తరలించాలన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా కాంటాలను వెంటనే వేయాలని అన్నారు. శుభ్రం చేసిన ధాన్యాన్ని కేంద్రాలకు తెచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధరను పొందాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ గణేష్, ఏఈఓ సాయిరాజ్, ఏపీఎం శోభారాణి, సీసీ రామయ్య, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురం, అడివెంల, కుంచమర్తి గ్రామాల్లో సెర్ప్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం తిమ్మాపురం క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి నేరెళ్ల సత్యం సందర్శించారు. ఈ కేంద్రాలలో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. రైతులు 17 శాతం వరకు తేమ ఉండేలా ధాన్యాన్ని ఆరబెట్టి, శుభ్రం చేసుకొని కేంద్రాలకు తేవాలని సూచించారు. పచ్చి ధాన్యాన్ని కేంద్రాలకు తెచ్చి కొనాలని ఒత్తిడి చేయవద్దని కోరారు. కార్యక్రమంలో వీఓఏలు దేవరకొండ విజయ, మన్నె సుజాత, ఆవుల భవాణి, నిర్వాహకులు పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలి

తుంగతుర్తి : రైతులు కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధరను పొందాలని ఏడీఏ జగ్గునాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. రైతులు 17శాతంలోపు తేమ ఉన్న ధాన్యాన్ని ఐకేపీ కొనుగోలు కేంద్రాలకు తీసుక రావాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటాలు వేగవంతంగా జరిగేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ బాలక్రిష్ణ, ఏఈఓ లక్ష్మీప్రసన్న, సీఈఓ వెంకటేశ్వర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కాంటాలు ఆలస్యం చేయొద్దు

మద్దిరాల : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు ఆలస్యం చేయొద్దని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. వర్షాలు పడే అవకాశం ఉన్నందున సెంటర్లలో టార్పాలిన్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మైసయ్య, వీఓఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి హత్య కేసులో ఒకరికి జీవితఖైదు

చివ్వెంల : వృద్ధురాలిని హత్య చేసిన ఘటనలో ఓ వ్యక్తికి జీవితఖైదుతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ శుక్రవారం తీర్పు వెల్లడించారు. వివరాల ప్రకారం.. మోతె మండలంలోని నామవరం గ్రామానికి చెందిన ఆకారపు ముత్తమ్మ భర్త చనిపోవడంతో కూతురు జానమ్మతో కలిసి గ్రామంలో నివసిస్తోంది. ఈ క్రమంలో ముత్తమ్మ పొలం పనులకు రెండు కాడెద్దులను కొనడానికి అదే గ్రామానికి చెందిన గుంటి పూలమ్మ దగ్గర రూ.30వేలు అప్పుగా తీసుకుని ఇంట్లో ఉంచింది. ఈ డబ్బులు తేవడాన్ని చూసిన అదే గ్రామానికి చెందిన దైద మహేందర్ డబ్బులు తనకు ఇవ్వాలని తాగి ఇంటికి వచ్చి గొడవ చేశాడు. దీంతో ముత్తమ్మ మహేందర్‌తో గొడవ పడడంతో ఇరుగు పొరుగు వారు అతడిని అక్కడి నుంచి పంపించారు. మరో రెండు రోజుల తర్వాత మళ్లీ తాగి వచ్చి డబ్బులు ఇవ్వకపోతే చంపుతా అని బెదిరించడంతో అక్కడే ఉన్న కూతురు జానమ్మ అతడితో గొడవపడి అక్కడి నుంచి పంపించి వేసింది. ఈ క్రమంలో ఆగస్టు 2018న ముత్తమ్మను ఒంటరిగా వదిలేసి కూతురు జానమ్మ బంధువుల ఇంట్లో శుభకార్యం నిమిత్తం చివ్వెంల మండలం బి.చందుపట్ల గ్రామానికి వెళ్లింది. ఆమె తిరిగి సాయంత్రం 5గంటల సమయంలో ఇంటికి రాగా మహేందర్ ఇంట్లో కనిపించాడు. ఇక్కడకు ఎందుకు వచ్చావు అని జానమ్మ అతడిని అడిగే లోపు ఆమెను చూసి పరారయ్యాడు. ఆమెతో పాటు గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు మహేందర్ పారిపోవడం చూశారు. వెంటనే జానమ్మ ఇంట్లోకి వెళ్లి చూడగా ముత్తమ్మ గొంతు కమిలిపోయి, చెవులోంచి రక్తం కారుతూ విగతజీవిగా పడిఉండడాన్ని గమనించి ఆస్పత్రికి తరలించింది. ఆస్పత్రిలో పరీక్షించిన వైద్యులు అప్పటికే ముత్తమ్మ మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ శివశంకర్ కేసు నమోదు చేసి నిందితుడి రిమాండ్‌కు తరలించారు. సాక్షులను విచారించిన న్యాయమూర్తి పీపీ కొంపల్లి లింగయ్య నిందితుడికి సెక్షన్ 302 కింద జీవిత ఖైదుతో పాటు, రూ.5వేల జరిమానా విధించారు. అలాగే బలవంతంగా డబ్బులు లాక్కున్న నేరానికి సెక్షన్ 380 కింద ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు, రూ.500జరిమానా విధించారు. జరిమానా చెల్లించని యెడల మరో రెండు నెలలు అదనంగా శిక్ష విధించారు. పీపీకి లైజన్ ఆఫీసర్ కె.సురేంద్రబాబు, కోర్టు కానిస్టేబుల్ నాగరాజు సహకరించారు.

ఐరిస్ విధానంతో దళారులకు అడ్డుకట్ట

- పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు



బొల్లంపల్లి కేంద్రంలో ఐరిస్ పనితీరు గురించి అవగాహన కల్పిస్తున్న ఏపీఎం మల్లేష్



వేల్పుచర్ల కేంద్రంలో రైతు నుంచి ఐరిస్ తీసుకుంటున్న నిర్వాహకుడు

అర్వపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో దళారి వ్యవస్థను కట్టడి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఈ యాసంగి ధాన్యం కొనుగోళ్లలో కొత్త నిబంధన అమలులోకి తీసుకొచ్చారు. పౌరసరఫరాల శాఖవారు ఐరిస్ (కనుపాప) విధానం అమలు చేస్తున్నారు. గతంలో ఆధార్ అనుసంధానం, ఓటీపీ ద్వారా ధాన్యం కొనుగోలు చేసేవారు. తాజాగా ఓటీపీతోపాటు ఐరిస్ విధానాన్ని అమలు చేస్తున్నారు. నూతన విధానంతో అక్రమాలకు అడ్డుకట్ట పడనుంది.

గతంలో ఇలా..

గతంలో రైతుల ఆధార్ నంబర్, బ్యాంక్ ఖాతా నమోదు చేస్తే వారి సెల్‌ఫోన్‌కు ఓటీపీ వచ్చేది. దాన్ని ట్యాబ్‌లో నమోదు చేసి ధాన్యం కొనుగోలు చేసేవారు. దీన్ని అదునుగా చేసుకొని రైతుల పేరుతో కొందరు దళారులు, వ్యాపారులు ధాన్యం విక్రయించేవారు. ఇలాంటి అక్రమాలను కట్టడి చేసేందుకు ఐరిస్ విధానం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ధాన్యం విక్రయించే రైతు తప్పనిసరిగా కొనుగోలు కేంద్రానికి రావాల్సి ఉంటుంది. ధాన్యం తూకమైన తర్వాత కేంద్రం నిర్వాహకులు సంబంధిత రైతుల ఐరిస్ తీసుకుంటున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ ఇచ్చి ఐరిస్ యంత్రాలు అందజేయగా ఈ కొత్త విధానాన్ని ప్రస్తుతం పాటిస్తున్నారు.

కౌలు రైతులకు అవకాశం..

కౌలు రైతులు మొదట ఏఈఓలను కలిసి వారి వివరాలు నమోదు చేయించాలి. ఈ వివరాలను ఏఈఓ ఓపీఎంఎస్ (ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం)లో నమోదు చేయనున్నారు. దీంతో కౌలు రైతులు సైతం పండించిన ధాన్యం వారే విక్రయించుకునే అవకాశం ఏర్పడింది.

జాజిరెడ్డిగూడెం మండలంలో 19 కేంద్రాలు..

ఈ యాసంగికి గాను జాజిరెడ్డిగూడెం మండలంలో 19 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో సెర్ప్ ఆధ్వర్యంలో 16 కేంద్రాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో రెండు కేంద్రాలు, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఒక కేంద్రం ఏర్పాటు చేశారు. మొత్తం 19 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. అన్ని కేంద్రాలకు యంత్రాలను అందజేసి ఐరిస్ విధానంను అమలు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి.

ఐరిస్ విధానం అమలు చేస్తున్నాం



జాజిరెడ్డిగూడెం మండలంలో ఈ సీజన్ నందు ఐరిస్ విధానాన్ని అమలు చేస్తున్నాం. అన్ని కేంద్రాలకు ఐరిస్ యంత్రాలను పంపిణీ చేశాం. ఈ ఐరిస్ నిర్వహణతో పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు జరుగుతాయి. ఈ విధానంతో అక్రమాలకు అడ్డుకట్ట పడనుంది.

- వలిశెట్టి మల్లేష్, ఏపీఎం, జాజిరెడ్డిగూడెం

జోరుగా చెరువుల మట్టి తరలింపు



ముక్కుడుదేవులపల్లి కుంటలో తరలిస్తున్న మట్టి

ఆత్మకూర్ (ఎస్) : ముక్కుడు దేవులపల్లి గ్రామంలో గల పిల్లబోయినకుంటలో యథేచ్ఛగా మట్టి తరలింపు కొనసాగుతోంది. అక్రమార్కులు జేసీబీల సాయంతో పెద్ద ఎత్తున ట్రాక్టర్ల ద్వారా మట్టిని తవ్వి ఇటుక బట్టీలకు, ఇతరులకు అమ్ముకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం 10 పది ట్రాక్టర్లలో చెరువులో నుంచి మట్టిని తరలిస్తుండగా స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు. అయితే అధికారులు వచ్చే లోగా ట్రాక్టర్లు, జేసీబీలు అక్కడ నుంచి వెళ్లిపోయాయి. ముక్కుడుదేవులపల్లి స్టేజీ వద్ద ఉన్న ఇటుక బట్టి వద్ద చెరువు మట్టి భారీగా ఉన్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

తుంగతుర్తి : అన్నారంలో ఉన్న మర్రికుంటలో అనుమతి లేకుండా కొందరు వ్యక్తులు అక్రమంగా చెరువు మట్టిని తరలిస్తున్నరని, వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఇటీవల మండల కేంద్రంలో చెరువు మట్టి తరలించకుండా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని, అయినా కొందరు వ్యక్తులు అక్రమంగా అన్నారంలోని మర్రికుంట నుంచి మట్టిని తరలిస్తున్నారని అన్నారు. అనంతరం వారు మట్టిని తరలించకుండా అడ్డుకున్నారు.

వాహనాల తనిఖీ



చెక్ పోస్టు వద్ద పట్టుబడ్డ నగదుతో అధికారులు

తిరుమలగిరి : పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో సూర్యాపేట–జనగామ ప్రధాన రహదారిపై నెల్లిబండ తండా చెక్ పోస్టు వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. తనిఖీల్లో సరైన ఆధారాలు లేని రూ.1 లక్ష నగదు పట్టుబడినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. ఆయన వెంట అధికారులు మారయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ

అర్వపల్లి : వడదెబ్బ బారిన పడకుండా రైతులు, హమాలీలు జాగ్రత్తలు తీసుకోవాలని సెర్ప్ ఏపీఎం వలిశెట్టి మల్లేష్ కోరారు. శుక్రవారం ఉయ్యాలవాడలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సెర్ప్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు, హమాలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఓఆర్ఎస్ ద్రావణం వాడే విధానంపై వైద్య సిబ్బంది వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లింగయ్య, ఏఎన్ఎం నాగరాణి, ఆశ కార్యకర్త ఎన్.నాగమ్మ, నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

నడిగూడెం : వేసవిలో మొక్కలు ఎండిపోకుండా చూడాలని ప్రత్యేక అధికారి సతీష్ కోరారు. శుక్రవారం కాగితరామచంద్రాపురంలో మెగా పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, తదితరులు ఉన్నారు.